క్లుప్తంగా

దుమ్ము లేవకుండా చర్యలు


రోడ్డుపై నీటిని చల్లుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్చోడ: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రోడ్డుపై సంబంధిత కాంట్రాక్టర్ దుమ్ము లేవకుండా నీటిని చల్లించారు. 'రోడ్డుపై దుమ్ము.. దుమ్ము' శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురితం కథనానికి కాంట్రాక్టర్ స్పందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్యాంకర్ ద్వారా నీటిని చల్లించారు. దీంతో ప్రయాణికులు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

దాజీశంకర్ వర్ధంతి జయప్రదం చేయండి

తాంసి: మండలంలోని సావర్గాం గ్రామంలోని దాజీశంకర్ స్మారక స్తూపం వద్ద ఆదివారం నిర్వహించే దాజీశంకర్ వర్ధంతిని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా నాయకులు దేవిదాస్ కోరారు. శనివారం సీపీఐ మండల కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లాలో అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు అరుణ్, సతీష్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు పూజలు


గోమాతకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలో శనివారం గ్రామస్తులు గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని బాల హనుమాన్ మందిరంలో గోఅష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పూలదండ కట్టి నైవేద్యాలు సమర్పించారు. కార్తీకమాసంలో భాగంగా వచ్చే గోఅష్టమిని పురస్కరించుకొని ప్రతిఏటా గోమాతకు పూజలు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

బోథ్: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలోని మార్కండే ఆలయంలో గోపూజ నిర్వహించారు. గోవులకు భక్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తికమాసం పూజలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని దిమ్మ గ్రామంలో కార్తికమాసాన్ని పురస్కరించుకొని ఏకబిలేశ్వర్ దేవాలయంలో శనివారం రుద్రాభిషేకం నిర్వహించారు. అదే విధంగా బిల్వార్చన, దీపోత్సవాలను కన్నుల పండువగా చేపట్టారు. ఆలయ అర్చకులు లింగయ్య మాట్లాడుతూ లోక కల్యాణార్థం రుద్రాభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. కార్తిక మాసంలో మహాశివుడికి రుద్రాభిషేకం చేస్తే సర్వం శుభం జరుగుతుందన్నారు.

కులగణన సర్వేకు సహకరించండి

బోథ్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని ధర్మ సమాజ్ పార్టీ బోథ్ నియోజకవర్గ ప్రచార కమిటీ సభ్యులు కొండమడుగు గణేష్ మహరాజ్ కోరారు. సర్వే నిర్వహించడం వలన కులాల జనాభా స్పష్టమవుతుందన్నారు. జనాభా ప్రకారమే రాజకీయ, ఆర్థిక ఫలాలు అందించాలన్నారు. ప్రభుత్వం సర్వే చేసిన రిపోర్టును వీలైనంత త్వరగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్‌లో చేరిక

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన యువకులు ప్రవీణ్, శ్రీకాంత్ నేరడిగొండలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట గ్రామ మాజీ సర్పంచ్ గంగయ్య, సీనియర్ నాయకుడు లస్మన్న, ఉన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

ఎదులాపురం: పత్తి పంటకు మద్దతు కల్పించాలని డిమాండ్‌తో ఈనెల 11 జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను విజయంతం చేయాలని అఖిల పక్ష రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి పిలుపు నిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మాట్లాడారు. పత్తి పంటకు మద్దతు ధర కల్పించాలని జిల్లా ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. అందుకే మద్దతు ధర కోసం ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో అఖిల పక్ష రైతు సంఘం నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

- మండలాల్లో కాంగ్రెస్ నాయకుల ఆందోళన
- వైఖరి మార్చుకోవాలని ఆగ్రహం


తలమడుగు: ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు


బోథ్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


తాంసి: అడ్డుకుంటున్న పోలీసులు

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల ఫ్లెక్సీ వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం నాయకులు డప్పుల చప్పుళ్ల మధ్య ఎమ్మెల్యే దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి, దహనం చేస్తుండగా.. పోలీసులు అడ్డుపడ్డారు. దీంతో కొద్దిసేపు నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు, నాయకులకు మధ్య కొంత తోపులాట చోటు చేసుకుంది. అనంతరం నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, వైస్ చైర్మన్ ఆడె గజేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రౌడీ రాజకీయాలు మానుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని దగ్గరుండి ధ్వంసం చేయించడం సరికాదన్నారు. ఈ ఘటనపై శనివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను దహనం చేసిన నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మ కరుణాకర్, అంకతి రవీందర్, ఆడేశీల, ఉయి క అనసూయ, ససానే మాధవ్, శంకర్ పాల్గొన్నారు.

నేరడిగొండ: తమ ఫ్లెక్సీని బీఆర్ఎస్ నాయకులు చింపివేశారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దిష్టిబొమ్మతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ఖబర్దార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రఫుల్ చందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రవి, శంకర్, పాల శంకర్, కుంట శంకర్, రాములు, చంద్రశేఖర్, ఊషన్న, సంజీవ్ పాల్గొన్నారు.

తలమడుగు: మండలంలోని సుంకిడి గ్రామంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. పోలీసులు జోక్యం చేసుకొని అడ్డుకున్నారు. ఈక్రమంలో కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీని బీఆర్ఎస్ నాయకులు చింపి వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకన్న యాదవ్, రఫీ, కల్యాణం రాజేశ్వర్, రాకేశ్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దిష్టిబొమ్మను శనివారం మండల కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో దహనం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ చింపివేతకు నిరసనగా ఆందోళన చేపట్టారు. దిష్టిబొమ్మ దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట జరిగింది. నాయకులు సంతోశ్, శ్రీధర్ రెడ్డి, నారాయణ, వెంకట్ రెడ్డి, రామన్న యాదవ్, సతీశ్, నరేశ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: బోథ్ ఎమ్మెల్యే తన వైఖరిని మార్చుకోవాలని గ్రెస్ నాయకులు చేశారు. బోథ్ మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని ధ్వంసం చేయడంతో శనివారం అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులు మతిస్థిమితం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. నాయకులు కళ్లెం నారాయణ్‌రెడ్డి, అబ్దుల్ అజీం, కొట్టురి లక్ష్మణ్, షాదుల్లా, ముస్తాఫా పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: బోథ్ మండలంలోని పొచ్చెర క్రాస్‌రోడ్డు వద్ద రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ దగ్గరుండి తొలగించినందుకు నిరసనగా శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జల్కే పాండురంగ్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రాథోడ్ నందుకుమార్, పోరెడ్డి నారాయణ, విజయ్‌కుమార్, కిషన్, రమేశ్, ముకుంద్‌రావ్, పాండు, వంశీ, నాందేవ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని షీటీం సభ్యులు సుశీల, సత్యమోహన్ అన్నారు. శనివారం జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు షీటీం విధులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవన్నారు. స్టాక్ పెట్టుబడి మోసం, రైతుల రుణ మాఫీ నకిలీ కాల్స్ మోసాలు, డ్రగ్ పార్శిల్ నకిలీ పోలీసు వీడియో కాల్, పార్ట్‌టైమ్ జాబ్ మోసం లాటరీ మోసం, బ్యాంక్ ఖాతాల పునరుద్ధరణ వంటి మోసాలకు గురైతే 1930కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇచ్చోడ: గత కొన్నేళ్ల నుంచి గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని శనివారం హైదరాబాద్‌లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి అజ్మీర శరత్‌కు వినతిపత్రం అందచేశారు. అర్హులైన సీఆర్టీలకు సర్వీసు క్రమబద్ధీకరణ చేయాలని, ప్రతీనెల గ్రీన్ ఛానల్ ద్వారా 1వ తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్టీల రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జాదవ్ వినంత్‌రావు, గౌరవ అధ్యక్షుడు మర్సకోల తిరుపతి, పవర్ సోమేశ్వర్, ధరం సోత్ వంశీ, కొమరెల్లి శంకర్, రాథోడ్ విజయ్, సిడాం రాంచేందర్, కుడిమేత సుంగు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కైలాస్‌నగర్: మౌలానా అబుల్ కలాం ఆజాద్, అలమా ఇక్బాల్ జయంతి, ప్రపంచ ఉర్దూ దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎనిమిది ఉర్దూ మీడియం పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఖిల్లా, బాలక్ మందిర్ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలల హెచ్ఎంలు రఫియా బేగం సాహెబా, షేక్ మునీర్ జడ్జిలుగా వ్యవహరించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఖాజా సిరాజుద్దీన్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు, భారత మొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమన్నారు. పోటీలో గెలుపొందిన వారికి ఈనెల 11న న్యూ భజరంగ్ ఫంక్షన్ హాల్‌లో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు రిజ్వాన్ ఖాన్, సజీల్ మెమన్, సమీర్ ఖాన్, తబ్రేజ్ ఖాన్, షేక్ ఇస్మాయిల్, హాఫీస్ షేక్ అబ్రార్, ముహమ్మద్ జావిద్, తలహా, ఇక్బాల్ పటేల్ పాల్గొన్నారు.

యువత సినీ రంగంలో రాణించాలి


క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: యువత తమ కల నైపుణ్యాలను మెరుగుపర్చుకుని సినీ రంగంలోనూ రాణించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం యాదవ సంఘం భవనంలో నిర్వహించిన అనాథ ప్రేమ సినిమా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి చిత్ర యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కళాకారులకు కొదువ లేదని ఆదిలాబాద్ అందాలు సినీ పరిశ్రమతో పాటు పర్యటకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ గజ్జు గౌడ్, భూపతి నారాయణ రెడ్డి, హీరోలు కల్యాణ్, బిమేష్, హీరోయిన్ యోగితా, విలన్ సాగర్ పాల్గొన్నారు.

గొప్ప క్రికెటర్‌గా ఎదగాలి

ఆదిలాబాద్: జిల్లా క్రికెటర్ కొడిమెల హిమతేజ గొప్ప క్రికెటర్‌గా ఎదగాలని మాజీ మంత్రి జోగు రామన్న ఆకాంక్షించారు. హైదరాబాద్ తరఫున ఆడుతున్న హిమతేజ రంజీ టోర్నమెంట్లో శనివారం రాజస్థాన్ జట్టుపై సెంచరీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లా నుంచి తొలిసారిగా రంజీ ట్రోఫీకి ప్రాతినిధ్యం వహించడం గొప్ప విషయమన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరిచి టీమిండియా తరఫున ఆడాలని ఆకాంక్షించారు.

సెల్‌ఫోన్‌ల అప్పగింత

ఆదిలాబాద్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను శనివారం అడిషనల్ ఎస్పీ సురేందర్‌రావు ఆదిలాబాద్ వన్‌టౌన్‌లో బాధితులకు అప్పగించారు. పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన స్వప్న ఏప్రిల్ 13న సెల్‌ఫోన్ చోరీకి గురైంది. అలాగే శాంతినగర్‌కు చెందిన అపూర్వ సెల్‌ఫోన్ ఏప్రిల్ 16న, రిక్షాకాలనీకి చెందిన కార్తీక్ సెల్‌ఫోన్ ఆగస్టు 14న రైతుబజార్‌లో పోగొట్టుకున్నారు. దీంతో బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగా వన్‌టౌన్ పోలీసులు వాటిని గుర్తించి బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, సీఐ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

20న తుడుందెబ్బ మహాసభ

ఉట్నూర్‌రూరల్: ఈనెల 20న ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ మహాసభ ఉట్నూర్‌లోని ఆదివాసీభవన్‌లో నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు శనివారం తెలిపారు. సమావేశానికి రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు రాష్ట్ర మహాసభ

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర మహాసభలను ఈనెల 10న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మ లచ్చిరాం, పి. రఘునందన్ రెడ్డిలు తెలిపారు. శనివారం సంఘ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు.

నేడు మాలీ కులస్తుల సమావేశం

కైలాస్‌నగర్: మాలీ కులస్తులకు ఎస్టీ హోదా కల్పించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న జాప్యంపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఆదివారం మాలీ కులస్తుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో గల పూలే గెస్ట్‌హౌస్‌లో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి సంఘ సభ్యులు, కులస్తులు హాజరు కావాలని కోరారు.

17న ఉద్యోగుల సదస్సు

కైలాస్‌నగర్: మాదిగ ఉపకులాల ఉద్యోగుల సదస్సును ఈనెల 17న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో నిర్వహించనున్నట్లు మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగు గంగయ్య ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే సదస్సుకు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. జిల్లాలోని మాదిగ ఉపకులాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలు చోరీ

బేల: మండలంలోని పాటన్ రెవెన్యూ గ్రామ శివారులోని పంట పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలు శుక్రవారం అర్ధరాత్రి చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు శనివారం చప్రాలకు చెందిన బాధిత రైతులు రామారావు, వెంకటి, రాకేశ్, దేవిదాస్‌లు గుర్తించి, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పాఠశాలకు ప్లేట్లు అందజేత

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి గ్రామానికి చెందిన దాసరి రాజ్‌కుమార్ 150 ప్లేట్లను అందజేశారు. భోజనం చేయడానికి విద్యార్థులకు సరిపడా ప్లేట్లు లేకపోవడంతో పాఠశాల కు అందజేశారు. సందర్భంగా ఆయనను గ్రా మస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- బైక్ ర్యాలీగా వెళ్లి సీసీఐ కొనుగోలు కేంద్రం పరిశీలన
- తేమశాతంతో మోసపోతున్నామని వాపోయిన రైతులు


పత్తిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని, రైతులకు పథకాల పేరుతో నిలువున మోసం చేస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం బోథ్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి నాయకులతో బైక్‌పై ర్యాలీ నిర్వహించి, స్వప్న జిన్నింగ్ మిల్లులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పత్తిని పరిశీలించారు. తేమ పేరుతో ధర తక్కువ చేస్తున్నారని రైతులు ఎమ్మెల్యేకు తమ గోడును వివరించారు. కాగా రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతుల పక్షాన పోరాటం చేస్తామని, సీసీఐ కేంద్రాలలో రైతులకు న్యాయం జరగడం లేదని, అందుకే కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిరాకరించినట్లు పేర్కొన్నారు. ప్రజల మద్దతుతో గెలిచానని, ప్రజల కోసం, రైతుల కోసం ఎమ్మెల్యేగా పోరాడతానన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా పత్తిని కొనాలని సీసీఐ అధికారులకు సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థిని సన్మానిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

నార్నూర్: మండలంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న జాదవ్ కాజల్ అనే గిరిజన విద్యార్థిని ఈనెల 15 నుంచి ఖమ్మం పట్టణంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో 68వ ఎస్‌జీఎఫ్ (స్కూల్ గెమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎంపికైనా సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విఠల్, పీడీ అడే విశ్వనాథ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈనెల 1న కుమురం భీం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డెన్ వనిత, ఉపాధ్యాయులు నిలయ్య, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

'అధికారులు తీరు మార్చుకోవాలి'


సోయా కొనుగోళ్లను పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

బేల: సబ్‌యార్డులో మార్కెట్ అధికారులు తీరు మార్చుకోవాలని జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో సోయా కొనుగోళ్లను పరిశీలించారు. రైతుల ఇబ్బందులపై ఆరా తీశారు. గత వారం రోజుల నుంచి సోయాను తీసుకువస్తే, అధికారులకు డబ్బులు ఇచ్చిన వారి పంటనే కొనుగోలు చేస్తున్నారని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యార్డులో సోయా కొనుగోళ్లను క్రమబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రెండు కాంటాలను ఏర్పాటు చేయించి, అదనపు కూలీలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట వైస్ చైర్మన్ సవాపురే విలాస్, డైరెక్టర్ మడావి చంద్రకాంత్, రైతులు ఉన్నారు.

ప్రారంభమైన సమగ్ర కుటుంబ సర్వే


సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్


ఉట్నూర్‌రూరల్: పరిశీలిస్తున్న ట్రెయినీ ఐఏఎస్

నార్నూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే శనివారం నార్నూర్, గాదిగూడ మండలాల్లో ప్రారంభమైంది. మండలంలోని ఖంపూర్ గ్రామంలో సర్వేను డిప్యూటీ కలెక్టర్ గంగాధర్, తహసీల్దార్ జాడి రాజలింగు, భీంపూర్‌లో ఎంపీడీవో జవహర్, నార్నూర్‌లో ఎంపీవో స్వప్నశీల పరిశీలించారు. మొదటి రోజు ఎటువంటి అటంకాలు లేకుండా సర్వే కొనసాగిందన్నారు.

తలమడుగు: ప్రతీ ఇంటిని సర్వే చేయాలని మండల ప్రత్యేకాధికారి గజనాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వివరాలు నమోదు చేసుకొని స్టిక్కర్ అతికించాలన్నారు. సర్వేలో ఏలాంటి ఇబ్బందులు ఉన్న వెంటనే అధికారుల సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, గజానంద్, పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో అధికారులు సర్వే నిర్వహించారు. శనివారం పులిమడుగు గ్రామంలో ట్రెయినీ ఐఏఎస్ అభిజ్ఞాన్ అధికారులు నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. అదే విధంగా సాలెవాడ(బి) గ్రామంలో ఎంపీవో మహేశ్ సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: మండలంలో కుటుంబ సర్వేను ఎలాంటి పొరపాట్లు లేకుండా చేయాలని మండల ప్రత్యేకాధికారి డీసీవో మోహన్‌సింగ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఎంపీడీవో శ్రీనివాస్‌తో కలిసి కుటుంబ సర్వేను పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన ఇళ్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థాగత నిర్మాణంతోనే విజయం సాధ్యం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్: సంస్థాగత నిర్మాణంతోనే పార్టీ విజయం సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన బీజేపీ సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్‌కు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లె గంగారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. స్వచ్ఛందంగా పార్టీలో చేరిన వారే పార్టీ విజయానికి శ్రమిస్తారని తెలిపారు. ఎన్నికలకు సమయం ఉన్న నేపథ్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని దిశ నిర్దేశం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రతీ ఒక్క కార్యకర్త పని చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బ్రహ్మానంద్, సుహాసిని రెడ్డి, మయూర్ చంద్ర, ఆదినాథ్, విజయ్, వేణుగోపాల్, నగేశ్, లాలమున్న, రాకేశ్, వేదవ్యాస్, ఆకుల ప్రవీణ్, జోగు రవి, కృష్ణ యాదవ్, రాందాస్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని టీజీవీపీ నియోజకవర్గ కన్వీనర్ గొర్ల నరేందర్ డిమాండ్ చేశారు. శనివారం ఇచ్చోడలో మాట్లాడారు. దాదాపుగా సంవత్సర కాలం గడుస్తున్నా.. కనీసం 30 శాతం పనులు పూర్తి కాలేదన్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.